## ఆక్రమణకు గురైన తూము పునరుద్ధరణ

### నిర్మాణ వ్యర్థాల తొలగింపు



తూములో నింపిన నిర్మాణ వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

మియాపూర్, డిసెంబర్14 : కబ్జాకు గురవుతున్న తూము పరిరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. 'తూము ఆక్రమణకు యత్నం' శీర్షికతో నమస్తే తెలంగాణ దిన పత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ సాయిహిల్స్ ఎదుట అంబీర్ చెరువు, ఎల్లమ్మ చెరువులకు అనుసంధానంగా ఉన్న తూమును కొందరు కబ్జా చేసేందుకు యత్నించారు. ప్రధాన రహదారి వైపు తూము ఉండటంతో.. ఎవరికీ అనుమానం రాకుండా.. పట్టాలు అడ్డం కట్టి మరీ పెద్ద ఎత్తున వాహనాలలో నిర్మాణ వ్యర్థాలతో తూమును పూడ్చివేశారు. తూము ఆక్రమణపై 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురించింది. స్పందించిన కూకట్‌పల్లి రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో తూము ఆక్రమణకు అడ్డు కట్ట వేశారు. ఈ మేరకు తూములో నింపిన నిర్మాణ వ్యర్థాలను ఆర్ఐ శ్రీనివాసరెడ్డి తొలగింప చేసి పూర్తి స్థాయిలో పునరుద్ధరించారు. ఈ సందర్భంగా ఆర్ఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

## ఆలయాభివృద్ధికి లక్ష విరాళం

దుండిగల్,డిసెంబర్14: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, శ్రీనివాసనగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో గురువారం అయ్యప్పస్వాముల(మాలాదారులకు) స్థానికులు యార్లగడ్డ వెంకటకిషోర్ అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు ఆయన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా స్వామి వారి ఆలయం పదునెట్టాంబడి పంచలోహాలతో నిర్మించనున్న 18మెట్ల నిర్మాణానికి రూ.1లక్ష విరాళం అందజేశారు. ఈ మెట్లను పంచలోహాలైన బంగారం, వెండి, రాగి, ఇనుము, తగరంతో ఏర్పాటు చేయనున్నట్లు ఆలయకమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులోకి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్,డిసెంబర్14: చెరువులోకి దిగి గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం లభించింది. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసులు కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. దుండిగల్ గ్రామానికి చెందిన రాయినోల్ల లక్ష్మి,ఆంజనేయులు దంపతుల పెద్దకొడుకు సురేశ్(30)జీహెచ్ఎంసీ, గాజులరామారం సర్కిల్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య రిషిక, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సురేశ్ బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మార్గమధ్యంలో ఉన్న డీ.పోచంపల్లిలోని కుడికుంట చెరువు వద్దకు చేరుకున్న సురేశ్‌యాదవ్ తాను చెరువులోకి దూకి చనిపోతున్నానంటూ భార్యకు ఫోన్‌చేసి చెప్పి చెరువులోని నీటిలోకి దిగి మునిగిపోయాడు. అక్కడే చేపలు పడుతున్న మత్స్యకారులు ఇది గమనించి పోలీసులకు సమాచారం అందించగా అప్పటికే చీకటి పడటంతో గాలింపు సాధ్యపడలేని విషయం విధితమే. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం నుండి జాలరుతో కలిసి దుండిగల్ పోలీసులు గాలించగా 11 గంటల ప్రాంతంలో సురేశ్ మృతదేహం లభించింది. దీంతోమృతదేహాన్ని పోలీసులు పోస్ట్‌మార్టం కోసం గాంధీవైద్యశాలకు తరలించారు. అయితే గతంలోనూ సురేశ్ ఇదేవిధంగా పలుమార్లు చెరువులో దూకి ఆత్మహత్య చేససుకుంటానని కుటుంబసభ్యులను బెదిరించే వాడని మృతుడి తల్లి తెలిపింది. కాగా సురేశ్ గత కొంత కాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడని, ఆత్మహత్యకు అది ఒక కారణమై ఉంటుందని లిఖితపూర్వకంగా చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏవీబీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా భరత్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 14 : అఖిలభారత విద్యార్థి పరిషత్ (ఏవీబీపీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పడమటి భరత్‌రెడ్డి నియమితులయ్యారు. ఢిల్లీలో ఈనెల 7 నుంచి జరుగనున్న జాతీయ మహాసభలు, తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పి.భరత్‌రెడ్డిని నియమిస్తూ నియామకపత్రాన్ని అందించారు.

## వద్దన్నచోటే డంపింగ్

### చోద్యం చూస్తున్న అధికారులు, సిబ్బంది

దుండిగల్,డిసెంబర్14: అక్కడ చెత్తవేయొద్దంటూ మున్సిపాలిటీ (జీహెచ్ఎంసీ) అధికారులు కొంత కాలం క్రితం ఫ్లెక్సిని ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఓ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు మాత్రం అధికారుల ఆదేశాలను లెక్కచేయడం లేదు. వేయొద్దన్నచోటే చెత్తను నిల్వచేస్తూ సవాల్ విసురుతున్నారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు గానీ, సిబ్బంది గాని ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం ఎంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, 30వ డివిజన్‌లోని మారుతీఎలైట్ అపార్ట్‌మెంట్ నిర్వాహకులు గతకొన్ని రోజులుగా చెట్లకొమ్మలను నరుకుతూ రోడ్డుపక్కన ఖాళీస్థలంలో డంప్ చేస్తున్నారు. విశేషమేమిటంటే బహిరంగ ప్రదేశంలో చెత్త వేయొద్దని మున్సిపల్ అధికారులు అక్కడే ఫ్లెక్సీని సైతం ఏర్పాటు చేశారు. దీనిని బేఖాతరు చేస్తు ఫ్లెక్సీ పక్కనే చెట్లకొమ్మలు, వ్యర్థాలను డంపింగ్ చేయడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్థలంలో తమ అపార్ట్‌మెంట్లకు చెందిన సైన్ బోర్డును ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఇప్పుడు ఎకంగా చెత్తను డంపింగ్ చేయడం పట్ల పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



చెత్తవేయొద్దని బ్యానర్ ఏర్పాటు చేసిన చోటనే చెట్ల కొమ్మలు వేసిన దృశ్యం

## కుత్బుల్లాపూర్ ప్రజలకు రుణపడి ఉంటా

● ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్,డిసెంబర్14: కుత్బుల్లాపూర్ నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజలు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, పార్టీ శ్రేణులు దండముడిలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, శాలువలను కప్పి శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న కొంపల్లి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

## ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అభినందనలు

కూకట్‌పల్లి ఎమ్మెల్యే గా మాధవరం కృష్ణారావు సాధించి, అసెంబ్లీలో ప్రణాస్వీకారం చేసిన నేపథ్యంలో మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ అల్లాపూర్ డివిజన్ ముస్లిం మైనార్టీనాయకులతో కలిసి ఎమ్మెల్యే ను శుభాకాంక్షలు తెలియజేశారు.

– అల్లాపూర్,డిసెంబర్14



## విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం

### జేఎన్‌టీయూహెచ్‌లో జాతీయ గీతాలాపన

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 14 : విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా.. జేఎన్‌టీయూహెచ్‌లో జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం కూకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో వైస్ ఛాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి కళాశాలలో ఉదయం 9.30 గంటలకు జాతీయ (జనగణమన) గీతాలాపన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్సిటీ ప్రాంగణంలోని క్లాస్‌రూమ్‌లు, కెఫ్టేరియా, క్రీడా ప్రాంగణం, ఆయా విభాగాలలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది క్రమ శిక్షణతో జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖాళీ సమయం దొరికితే సెల్‌ఫోన్లు, ఫేస్‌బుక్‌లు, గేమ్స్‌తో బిజీబిజీగా గడుపుతున్న విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడం లక్ష్యంగా జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతిరోజూ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9.30 గంటలకు జాతీయ గీతాలాపన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంతో విద్యార్థులు, అధ్యాపకుల్లో దేశభక్తితో పాటు నూతన ఉత్తేజం కలుగుతుందని తెలిపారు. మొదటి రోజు చేపట్టిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించినట్లు తెలిపారు.


జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ గీతాలాపనను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌రెడ్డి

● జేఎన్‌టీయూహెచ్‌లో విద్యార్థుల కోసం డ్రాప్‌బాక్స్

కేపీహెచ్‌బీ కాలనీ : జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు సౌలభ్యం కోసం డ్రాప్‌బాక్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వర్సిటీ కళాశాలలో చదువుకునే విద్యార్థులు మైగ్రేషన్, ప్రొవిజినల్, బోనఫైడ్, కస్టోడియన్, మార్క్స్ మెమో లాంటి సర్టిఫికెట్ల కోసం కౌంటర్ల వద్ద దరఖాస్తులతో క్యూలో నిలబడి ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యను అధిగమించే దిశగా కళాశాల ప్రాంగణంలో ఈనెల 19 నుంచి డ్రాప్‌బాక్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థులకు సంబంధించిన ఆయా సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులను డ్రాప్‌బాక్స్‌లో వేయాల్సి ఉంటుందన్నారు. ఉదయం 10.30 గంటలకు.. సాయంత్రం 3.30 గంటలకు డ్రాప్‌బాక్స్‌లోని దరఖాస్తులు తీసుకుని సంబంధిత సర్టిఫికెట్లను.. భోజన విరామం, తరగతులు ముగిసిన తర్వాత ప్రత్యేక కౌంటర్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వర్సిటీ కళాశాల ప్రాంగణంలోని అకాడమిక్ బిల్డింగ్ వద్ద, ఎగ్జామినేషన్ బ్రాంచి వద్ద రెండు డ్రాప్‌బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

### సెయింట్ మార్టిన్ కళాశాలలో

## జాతీయ స్థాయి స్వయం కృషి-23 ఎక్స్‌పో


దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో స్వయం కృషి-ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న కళాశాల డైరెక్టర్ జి.చంద్రశేఖర్‌యాదవ్, ప్రిన్సిపాల్ పి.సంతోష్‌కుమార్‌పాత్ర తదితరులు

కుత్బుల్లాపూర్,డిసెంబర్14: దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ స్థాయి స్వయం కృషి-2023 ఎక్స్‌పో జరిగింది. విద్యార్థుల్లో వ్యవస్థాపక నైపుణ్యాలను వెలికితీసేందుకు, ఉపాధి అవకావాలపై మార్గాలను అన్వేషించేందుకు వీలుగా తెలంగాణలోని వివిధ కళాశాలల నుండి మొత్తం 216 మంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని స్టాల్స్ ఏర్పాటు చేసి స్వయం ఉపాది మార్గాలపై ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను కళాశాల డైరెక్టర్ జి.చంద్రశేఖర్‌యాదవ్, ప్రిన్సిపాల్ డా.పి.సంతోష్‌కుమార్‌పాత్ర ప్రారంభించి మాట్లాడారు.

### వీఎన్ఆర్ వీజేఐఈటీకళాశాలలో

## 'కన్వర్జెన్స్2కే23ఆర్' సాంకేతికోత్సవం ప్రారంభం

దుండిగల్,డిసెంబర్14: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతినగర్‌లోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీజేఐఈటీ)కళాశాలలో గురువారం 'కన్వర్జెన్స్2కే23ఆర్' పేరిట సాంకేతికోత్సవం, అదే విధంగా 'ఎక్‌పిఫో6.0 హెచ్'పేరిట సమారంభోత్సవం ఏకకాలంలో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ఉపగ్రహ సమాచార సంగ్రహణం, ఇన్‌జెస్ట్ వ్యవస్థల రంగం(ఎన్ఆర్ఎస్ఈ) ఉప సంచాలకులు జీ.రమాదేవి ముఖ్యఅతిథిగా హాజరు కాగా గౌరవ అతిథిగా 'మంత్ర4ఛేంజ్' వ్యవస్థాపకులు శ్రీరామ్ చెముటూరి హాజరయ్యారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు సంకల్పదీక్షతో తమ లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విజ్ఞానజ్యోతి ఉపాధ్యక్షులు కోడే దుర్గాప్రసాద్, విద్యార్థి పురోగతి డీన్ డా,వై.పద్మశాయి, సంచాలకులు ఆచార్య బీ.చెన్నకేశవరావు, ప్రధానాధ్యపకులు ఆచార్య డా.సీడీ నాయుడు, ఎక్‌ఫిఫో సమన్వయకర్త, వీజేహబ్ మేనేజర్ డా.చక్రవర్తుల కిరన్‌తో పాటు పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ-టెక్నికల్ సింఫోజియం, అంత్రప్రెన్యూర్‌షిప్ సావనీర్‌లను ఆహుతులు, కళాశాల యాజమాన్యంతో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు 'నృత్య తరంగ్' పేరుతో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.


సావనీర్‌లను ఆవిష్కరిస్తున్న అతిథులు, కళాశాల ప్రతినిధులు

## సీసీ రోడ్డు పనుల పరిశీలన



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని మహంకాళీనగర్‌లో రూ. 40 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాణ పనులలో నాణ్యతను పాటించాలని, ఎక్కువ కాలం మన్నేలా చూడాలని సూచించారు. డివిజన్ వ్యాప్తంగా అన్ని కాలనీలలో పూర్తి స్థాయిలో రహదారులు సహా ఇతర మౌలిక వసతుల కల్పనను చేపడుతున్నట్లు కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

– మియాపూర్, డిసెంబర్ 14

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి



బాలానగర్ డివిజన్ పరిధి ఇందిరానగర్‌లో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో పలువురు క్రైస్తవులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

–బాలానగర్, డిసెంబర్ 14